క్లుప్తంగా

స్ప్రింగ్‌ఫీల్డ్ పాఠశాలలో మత ప్రచారంపై విచారణ


స్ప్రింగ్‌ఫీల్డ్ పాఠశాలలో విచారిస్తున్న జిల్లా ఉప విద్యాశాఖ అధికారి సువర్ణ

పద్మనాభం: మండలంలోని కృష్ణాపురంలో నిర్వహిస్తున్న స్ప్రింగ్ ఫీల్డ్ పాఠశాలలో క్రిస్టియన్ మతం గురించి బోధిస్తున్నారని అందిన ఫిర్యాదుపై జిల్లా ఉప విద్యాశాఖ అధికారి సువర్ణ మంగళవారం విచారణ చేపట్టారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్కూల్‌కు చేరుకున్న ఆమె అక్కడి నిర్వాహకులతో మాట్లాడారు. ఉద్దేశపూర్వకంగా ఓ మతం గురించి బోధించకూడదని యాజమాన్యాన్ని ఆదేశించారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకూడదని సూచించారు. విచారణలో ఎంఈవో పి.రమణ, తదితరులు పాల్గొన్నారు.

రాస పోలమాంబకు ప్రత్యేక అలంకరణ



తగరపువలస : భీమిలి మండలం మజ్జివలస పంచాయతీ గ్రామదేవత రాస పోలమాంబ అమ్మవారిని మంగళవారం ప్రత్యేకంగా అలంకరించారు. ఎర్ర గులాబీ, పసుపు చామంతులు, గజ మాలలతో అలంకరణ పూర్తి చేశారు. మజ్జివలసకు చెందిన యూనిక్ క్వీన్స్ బ్యాచ్ – 1 సభ్యులైన కాగితాల దేవి, కొండపు భవానీ, చిల్ల అంజలి, కాగితాల రాజేశ్వరి, పిన్నింటి ప్రసన్న, గీత, నాగరత్నం, బట్టు నందు, దేవి అలంకరణకు సహాయం చేయగా తుపాకుల అప్పలరాసయ్య, రాసమ్మ దంపతులు ప్రసాదాలు పంపిణీ చేశారు.

యువకుడి ఆత్మహత్య

తగరపువలస : జీవీఎంసీ రెండో వార్డు వలందపేటకు చెందిన వాసుపల్లి ఎల్లారావు అనే వ్యక్తి సోమవారం రాత్రి ఇంట్లో సీలింగ్‌కు చున్నీతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు మృతుని తల్లి మసేనమ్మ భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేసింది. రాత్రి 9 గంటల సమయంలో ఫోన్ చూసుకుంటూ ఇంట్లోకి వెళ్లిన ఎల్లారావు భోజనానికి రమ్మని కుటుంబ సభ్యులు పిలిస్తే సమాధానం రాలేదు. తలుపు రంధ్రం ద్వారా చూడగా ఎల్లారావు సీలింగ్‌కు వేలాడుతుండడంతో తలుపులు బద్దలుకొట్టి సంగివలస అనిల్ నీరుకొండ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మరణించినట్టు అక్కడి వైద్యులు తెలిపారు. టైల్స్ వర్కు చేసే ఎల్లారావు నాలుగు రోజులుగా పనికి వెళ్లకపోవడంతో కుటుంబ సభ్యులు మందలించడంతోనే ఈ అఘాయిత్యానికి పాల్పడినట్టు మసేనమ్మ పోలీసులకు చేసిన ఫిర్యాదులో పేర్కొంది. మృతునికి ఇంకా వివాహం జరగలేదు. భీమిలి ఎస్ఐ గంటా హరీష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డిగ్రీ ప్రవేశాల ప్రక్రియ ప్రారంభం


స్పెషల్ కేటగిరీ విద్యార్థుల ధ్రువపత్రాలు పరిశీలిస్తున్న అధ్యాపకులు

మద్దిలపాలెం: డిగ్రీలో ప్రవేశాల ప్రక్రియ మంగళవారం ప్రారంభమైంది. ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు సంబంధించి స్పెషల్ కేటగిరీ విద్యార్థుల ధ్రువపత్రాల పరిశీలన కార్యక్రమం మద్దిలపాలెం డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగింది. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ప్రథమ సంవత్సరం ప్రవేశాలకు సంబంధించి స్పెషల్ కేటగిరీ సర్టిఫికెట్లను పరిశీలిస్తున్నట్టు వీఎస్ కృష్ణా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు తెలిపారు. సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ ఈ నెల 25వ తేదీ వరకూ జరుగుతుందన్నారు.

సాయంత్రం.. వెలవెల

- మధురవాడలో సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 వరకు రైతుబజార్
- తగిన ప్రచారం లేక నష్టపోతున్న రైతులు


మధురవాడలోని రైతు బజార్


కొనుగోలుదారులు లేక వెలవెలబోతున్న స్టాల్స్

మధురవాడ : కొమ్మాది జంక్షన్‌కి సమీపంలో ఉన్న మధురవాడ రైతు బజార్‌కి అధికార యంత్రాంగం తగిన ప్రచారం కల్పించడంలో విఫలమవుతున్నారు. చాలా ఏళ్లుగా ఉదయం పూట ప్రారంభమై మధ్యాహ్నం 1 గంట వరకు మాత్రమే బజారు నిర్వహించేవారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సాయంత్రం పూట కూడా బజారు నిర్వహించేలా చర్యలు చేపట్టింది. అయితే ఇక్కడ పూర్తి స్థాయిలో వసతులు, లైటింగ్ సక్రమంగా లేకపోవడం, సాయంత్రం పూట కూడా నిర్వహిస్తున్నట్టు తగిన ప్రచారం కల్పించలేకపోవడంతో కొనుగోలుదారులు ఆశించిన స్థాయిలో రావడం లేదు. దీంతో ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి ఇక్కడకు సరకులు తీసుకొస్తున్నా తగిన బేరాలు లేక, కనీసం పెట్టుబడి కూడా సక్రమంగా రాక రైతులు ఈసురోమంటూ ఇళ్లకు చేరుకోవాల్సి వస్తోంది. సాయంకాలం బజార్ ఇక్కడ రోజూ 4 గంటల నుంచి రాత్రి 8 వరకు పనిచేస్తుంది. వాస్తవంగా ఇక్కడ సాయంత్రం కూడా పనిచేసేలా చర్యలు చేపట్టడం చాలా ఉపయోగకరం. మధురవాడ పరిసర ప్రాంతాల్లోని బోయిపాలెం మొదలు ఎండాడ, సారగర్‌నగర్, పీఎంపాలెం, మిథిలాపురి ఉడా కాలనీ, కొమ్మాది, పరిసర ప్రాంతాల్లో లక్ష వరకు జనాభా ఉన్నారు. ఈ ప్రాంతాల్లో ఇలాంటి అవకాశం ఎక్కడా లేదు. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి మధురవాడలో సాయంత్రం పూట రైతు బజార్ నిర్వహిస్తున్నట్లు విస్తృత ప్రచారం కల్పించడంతోపాటు... పూర్తి స్థాయిలో వసతులు కల్పించాలని రైతులు, స్థానికులు కోరుతున్నారు.

తగిన ప్రచారం కల్పించాలి



మధురవాడ, ఎండాడ, రుషికొండ పరిసర ప్రాంతాల్లో నివసిస్తున్న సుమారు లక్ష జనాభాకు మధురవాడలోని రైతు బజార్ ఒక్కటే ఆధారం. అంత ప్రాధాన్యత కలిగిన ఈ రైతు బజార్‌ను రాత్రి వేళ కూడా నిర్వహిస్తున్నారన్న విషయం చాలా మందికి తెలియదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సాయంత్రం కూడా రైతులు, ప్రజల సౌకర్యార్థం బజారు నిర్వహణకు చర్యలు చేపట్టింది. కానీ తగిన ప్రచారం కల్పించడంలో అధికార యంత్రాంగం విఫలమైంది. తక్షణమే విస్తృత ప్రచారం కల్పించాలి.

– కాంతారావు, మధురవాడ

ప్రయోజనకరంగా తీర్చిదిద్దాలి



మధురవాడలో రైతు బజార్ ఏర్పాటుతో ఎంతో ప్రయోజనం కలుగుతోంది. పైగా ఉదయం, సాయంత్రం రెండు పూటలూ నిర్వహిస్తుండడం చాలా మంచి పరిణామం. అయితే ఈ విషయం చాలా మంది వినియోగదారులకు తెలియదు. దీనికి తగిన ప్రచారం కల్పించడంతోపాటు రైతు బజార్ రోడ్డులోని ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలి. ఇక్కడ ఎప్పటికప్పుడు ట్రాఫిక్ స్తంభించడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. పరిశుభ్రత మెరుగుపరచడంతోపాటు మరిన్ని స్టాల్స్ పెంచాల్సిన అవసరం ఉంది.

– అల్లాడ వెంకటరావు, మధురవాడ

సౌకర్యాలు కల్పించాలని ఆందోళన


బక్కన్నపాలెంలో నిరసన తెలుపుతున్న లబ్ధిదారులు

మధురవాడ : జీవీఎంసీ 6వ వార్డు బక్కన్నపాలెంలో సినీ పరిశ్రమ తరపున నిర్మించిన హుద్‌హుద్ కాలనీ వద్ద లబ్ధిదారులు మంగళవారం నిరసన తెలిపారు. సుమారు 150 మంది వివిధ ప్రాంతాలకు చెందిన వారికి ఇక్కడ ఇళ్లు కేటాయించారు. ఇళ్లు కేటాయించినప్పటికీ విద్యుత్, నీటి సరఫరా మరిచారంటూ ఇక్కడి ఎన్టీఆర్ హౌసింగ్ సొసైటీ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలంటూ నినాదాలు చేశారు. మరోవైపు ఈ ప్రాంతంలో భూములు కోల్పోయిన బక్కన్నపాలెం, రేవళ్లపాలెం, కొమ్మాదికి చెందిన బాధిత రైతులు కూడా తమకు ఇళ్లు కేటాయించిన తర్వాతే ఇతరులకు కేటాయించాలని, నివాసాలకు తాళాలు కూడా వేసి ఆందోళన చేస్తున్నారు.

డ్వాక్రా మహిళలకు ఆర్పీల వేధింపులు

బ్యాంకు రుణాల కోసం కమీషన్లు ఇవ్వాలని డిమాండ్

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్‌లో డ్వాక్రా మహిళలకు లంచాల బెడద తప్పడం లేదు. ప్రతీ నెల ఒక్కో గ్రూప్ నుంచి ఆర్పీలకు రూ.100 చెల్లిస్తున్నా బ్యాంకు రుణాలు పొందేటప్పుడు పర్సంటేజ్ ఇవ్వక తప్పడం లేదని మహిళలు వాపోతున్నారు. మంగళవారం స్థానికంగా ఉన్న ఒక గ్రూప్ మహిళలు పది మంది బ్యాంకు రుణం కోసం ఆర్పీని సంప్రదించగా రూ.10 లక్షల రుణానికి అర్హులని, అందుకోసం గ్రూప్ మొత్తం రూ.6 వేలు చెల్లించాలని డిమాండ్ చేసింది. ఇందుకు గ్రూప్ సభ్యులు రూ.2 వేలు ఇస్తామని చెప్పగా ఆర్పీ ససేమిరా అని తిరస్కరించింది. రుణం కావాలంటే ఇది వరకు మిగిలిన గ్రూప్ మహిళలు కూడా కమీషన్ ఇచ్చారని, కావాలంటే అడిగి తెలుసుకోవాలని రిఫరెన్స్ ఇచ్చింది. ఈ కమీషన్ తానొక్కరికే కాదని, జీవీఎంసీ కార్యాలయంలో సిబ్బందితో పాటు బ్యాంకు సిబ్బందికి కూడా వాటా ఇవ్వాలని చెప్పడంతో సదరు గ్రూపు మహిళలు అవాక్కయ్యారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఆర్పీలకు రూ.3 వేలు మాత్రమే ఇచ్చేవారని, అప్పట్లో కూడా డ్వాక్రా సంఘాల నుంచి కమీషన్లు తీసుకునేవారన్నారు. 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్పీలకు గౌరవ వేతనం రూ.10వేలకు పెంచారన్నారు. అయినప్పటికీ కమీషన్ల పేరుతో వేధించడం తగదని డ్వాక్రా మహిళలు వాపోతున్నారు. కమీషన్లు ఇస్తే తప్ప రుణాల కోసం బ్యాంకులకు సిఫారసు చేయమని చెప్పడం సరికాదన్నారు. దీనిపై కూటమి ప్రభుత్వం, అధికారులు స్పందించాలని పలు డ్వాక్రా మహిళా సంఘాల ప్రతినిధులు కోరుతున్నారు.

కృష్ణానగర్ లే అవుట్‌ను డీనోటిఫై చేయాలని వినతి


మాట్లాడుతున్న శ్రీనివాసరావు, తదితరులు

మధురవాడ: మధురవాడ మిథిలాపురి ఉడా కాలనీలో గల కృష్ణానగర్ లే అవుట్‌ను హైకోర్టు ఆర్డర్ ప్రకారం డీనోటిఫై చేయాలని కలెక్టర్‌కి వినతి పత్రం ఇచ్చినట్టు కృష్ణానగర్ లే అవుట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాసరావు చెప్పారు. మిథిలాపురి ఉడా కాలనీలో ఆయన, కార్యదర్శి సీహెచ్.రామ్మోహనరావు, సత్యనారాయణ మాట్లాడారు. మధురవాడ రెవెన్యూ గ్రామం సర్వే నంబర్లు 262/4, 263/2, 276/1, 277/1, 277/2, 278లోని సుమారు 17.7 ఎకరాల భూమిలో వేసిన ప్లాట్లు 1991లో కొనుగోలు చేశామన్నారు. దీనిపై వచ్చిన ల్యాండ్ సీలింగ్, ఇతర వివాదాల్లో హైకోర్టు తమకు అనుకూలంగా తీర్పు ఇచ్చినట్టు చెప్పారు. అందువల్ల లే అవుట్‌ని డీ నోటిఫై చేయాలని కోరినట్టు చెప్పారు.

ఆక్రమణను అడ్డుకున్న కాలనీవాసులు


ఆక్రమణదారులు తుప్పలు తొలగించిన సాయిరాం కాలనీలోని ప్రభుత్వ భూమి

మధురవాడ: విశాఖ రూరల్ మండలం పరిధిలోని సాయిరాం కాలనీలో ఉన్న సర్వే నంబరు 3 కొండ వద్ద ప్రభుత్వ భూమిని ఆక్రమించేందుకు ఓ వ్యక్తి ప్రయత్నించగా స్థానికులు అడ్డుకున్నారు. ఇక్కడి స్థలం కబ్జాకు కొన్నేళ్లుగా అనేక మంది ప్రయత్నిస్తున్నారు. వారిని స్థానికులు అడ్డుకుంటూ వస్తున్నారు. తాజాగా ఓ వ్యక్తి మంగళవారం ఉదయం కొంత మంది కూలీలను పంపించి తుప్పలు తొలగింపచేయగా కాలనీ పెద్దలు అడ్డుకున్నారు. అయితే సచివాలయ గ్రేడ్ – 2 వీఆర్వో, అడ్మిన్‌తో సహా ఆర్ఐ ప్రవీణ్ కుమార్‌కు సమాచారం ఇచ్చేందుకు స్థానికులు ప్రయత్నించగా అధికారులు అందుబాటులోకి రావడం లేదు.

మందుబాబులకు రూ.2.7 లక్షల జరిమానా

తగరపువలస: ఆనందపురం మండలంలో డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన 27 మంది మందుబాబులకు భీమిలి 15వ అదనపు మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ సౌజన్య ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున రూ.2.70 లక్షలు జరిమానా విధించారు. ఇటీవల వీరు పట్టుబడగా పోలీసులు న్యాయస్థానంలో హాజరుపరిచారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్ఐ పాపారావు మాట్లాడుతూ మద్యం మత్తులో వాహనాలు నడిపితే న్యాయస్థానం కఠినంగా వ్యవహరిస్తుందని హెచ్చరించారు.

ఆర్టీసీ ఉద్యోగుల అలవెన్స్‌లు చెల్లించాలి

మద్దిలపాలెం: ఏపీఎస్ ఆర్టీసీ ఉద్యోగులకు బకాయి ఉన్న అలవెన్స్‌లను తక్షణం ప్రభుత్వం చెల్లించాలని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రమణారెడ్డి కోరారు. ఈ మేరకు రాష్ట్ర ట్రెజరీస్ డైరెక్టర్ మోహనరావును మంగళగిరిలో కలిసి మంగళవారం వినతిపత్రం అందజేశారు. దీనిపై డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీస్ సానుకూలంగా స్పందించారని, త్వరలో బకాయిలు చెల్లించనున్నామని చెప్పారని రమణారెడ్డి తెలిపారు. డిపోల వారీగా బకాయి ఉన్న ఉద్యోగులకు వేతనంతో కలిపి చెల్లించే విధంగా ఆదేశాలు జారీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎంయూఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసరాజు, సంయుక్త కార్యదర్శి రాజేష్‌కుమార్, సీసీఎస్ పాలక వర్గ సభ్యులు పాల్గొన్నారు.

ప్రాథమిక విద్యే విద్యార్థుల భవిష్యత్‌కు పునాది


బాలగంగాధర్ తిలక్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంఈవో శివరాణి, ఉపాధ్యాయులు తదితరులు

తగరపువలస: విద్యార్థుల భవిష్యత్‌కు ప్రాథమిక విద్యే పునాది అని భీమిలి ఎంఈవో ఎం.శివరాణి సూచించారు. జీవీఎంసీ ఒకటో వార్డు బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాలలో శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా బోధనాభ్యసన సామగ్రిని మంగళవారం ఆమె పరిశీలించారు. గణిత క్లబ్‌ను పరిశీలించి ఫజిల్స్‌పై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. భారత స్వాతంత్రోద్యమ నాయకులు బాల గంగాధర్ తిలక్, చంద్రశేఖర్ అజాద్ జయంతి సందర్భంగా వారి చిత్రపటాలకు నివాళులర్పించారు. ఉపాధ్యాయులు నరహరిశెట్టి రమేష్, బుగత మల్లిక, పిన్నింటి నాగమణి పాల్గొన్నారు. భీమిలి మండలం శింగనబంద పంచాయతీ కృష్ణంరాజుపేటలో ఉపాధ్యాయుడు గొట్టుపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో శిక్షా సప్తాహ్ నిర్వహించారు.

ప్రకృతి వైపరీత్యాలపై అవగాహన అవసరం

తగరపువలస: ప్రకృతి వైపరీత్యాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని జాతీయ విపత్తుల నిర్వహణ దళం ప్రాంతీయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వరరావు సూచించారు. మంగళవారం భీమిలి మండలం చిప్పాడ జెడ్పీ హైస్కూల్‌లో 8 నుంచి 10వ తరగతి విద్యార్థులకు తుఫాన్లు, భూకంపాలు, వరదల నుంచి రక్షించుకునే మెలకువలను ప్రయోగాత్మకంగా వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ఎంవీటీ రత్నం, ఉపాధ్యాయులు రేఖ అప్పారావు, ఎస్.విజయకుమార్, సుశీల్‌కుమార్, హేమసుందరరావు, రామస్వామి, రమేష్, త్రివేణి, అనురాధ, రాజేశ్వరి, మధురవాణి, సింహాచలం, వీఆర్వో పల్లంటి శ్యామ్‌సుందరరావు, సరగడ రాజారెడ్డి, సరగడ శ్రీరామమూర్తి, సరగడ అప్పారావు పాల్గొన్నారు.

వేతనాలు అందక ఇబ్బందులు

కొమ్మాది : సముద్ర తీర ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు పర్యాటకులను అప్రమత్తం చేస్తూ, ప్రమాద సమయాల్లో వారి ప్రాణాలు రక్షిస్తున్న లైఫ్‌గార్డ్స్‌కు 4 నెలల నుంచి వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భీమిలి బీచ్, ఐటీ జంక్షన్, రుషికొండ, సాగర్‌నగర్, జోడుగుళ్లపాలెం, ఆర్‌కే బీచ్, యారాడ బీచ్, ముడసర్లోవ ప్రాంతాల్లో మొత్తం 47 మంది జీవీఎంసీ లైఫ్ గార్డ్స్ విధులు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది మార్చి నుంచి జీతాలు అందక ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమకు వేతనాలు విడుదల చేయాలని కోరుతున్నారు.

అంధకారంలో పాత పీఎం పాలెం రోడ్డు


కారుషెడ్ కూడలి నుంచి పాత పీఎం పాలెం వెళ్లే రోడ్డులో వెలగని వీధి దీపం

పీఎం పాలెం : కారుషెడ్ కూడలి నుంచి పాత పీఎం పాలెం వెళ్లే రోడ్డులో సక్రమంగా వీధి దీపాలు వెలగడం లేదు. చీకటి పడితే ఈ రోడ్డులో అంధకారం రాజ్యమేలుతోంది. విద్యుత్ స్తంభాలకు అమర్చిన ఎల్ఈడీ విద్యుత్ దీపాలు అలంకారప్రాయంగా దర్శనమిస్తున్నాయి. స్థానిక పిలకవానిపాలెం, హౌసింగ్ బోర్డు కాలనీ, తదితర కాలనీలకు వెళ్లేందుకు ఈ రోడ్డులోనే వేలాది మంది ప్రయాణిస్తుంటారు. విద్యుత్ దీపాలు లేకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. రోడ్డు పొడవునా జీవీఎంసీ ఏర్పాటు చేసిన ఎల్ఈడీ విద్యుత్ దీపాలు పూర్తి స్థాయిలో ఏనాడూ వెలగడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ మార్గంలో వీధి కుక్కల బెడద అధికంగా ఉందని, చీకటి పడితే బితుకుబితుకుమంటూ ప్రయాణించాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ అధికారులు వీధిలైట్లు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ప్లీజ్.. నన్ను తొలగించకండి..!


నిడిగట్టు శ్మశానవాటికలోని మర్రిచెట్టు

ఆరు దశాబ్దాలకు పైగా అందరికీ నీడనిస్తున్నా.. శాఖోపశాఖలుగా విస్తరించి పశుపక్ష్యాదులకు ఆవాసంగా, ఆహారంగా.. పేదలకు వంట చెరకుగా వుపయోగపడుతున్నా.. తేనెటీగలకు పుట్టిల్లుగా మారి ఎందరికో మధురిమలు పంచుతున్నా.. బంధువుల అంత్యక్రియలకు ఇక్కడి శ్మశానవాటికకు వచ్చే వారికి కోసం పాలకులు షెడ్లు నిర్మించకపోయినా.. నా నీడలో సేద తీర్చాను.. నాపై దెయ్యాలు వుంటాయని ఎందరు అపవాదు వేసినా మౌనంగా భరించాను.. నిడిగట్టు పంచాయతీకే ల్యాండ్‌మార్కుగా నిలిచి మండు వేసవిలో చల్లని గాలితో ఎందరినో సేదతీర్చాను.. అలాంటి నన్ను కొందరు స్వార్థంతో, అకారణంగా కూల్చేయాలని గొడ్డళ్లు నూరుతుండడం దారుణం.. శ్మశానవాటికలో అభివృద్ధి పనులు చేపట్టకపోయినా ఆ వంకతో కూకటివేళ్లతో నన్ను పెకిలించాలనుకోవడం దుర్మార్గం.. నన్ను తొలగిస్తే.. నా స్థానం భర్తీ చేసేది ఎవరు.. అందుకోసం ఎంత సమయం, ఎంత శ్రమ అవసరమో ఓ సారి ఆలోచించుకోండి.. ఇన్నేళ్లుగా అందరికీ మేలు చేసిన తనను తొలగించొద్దని వేడుకుంటున్నా.

– ఇదీ ఓ మర్రి చెట్టు ఆవేదన

జీవీఎంసీ 4వ వార్డు నిడిగట్టు శ్మశానవాటికలోని మర్రిచెట్టును కొందరు స్వార్థంతో తొలగించాలని కుయుక్తులు పన్నుతుంటే... మరికొందరు ఆ చెట్టును పరిరక్షించుకుంటామని ఒట్టు పెట్టుకుంటున్నారు. ఈ విషయంలో ఉన్నతాధికారులు స్పందించి మర్రిచెట్టుకు ప్రాణభిక్ష పెట్టాలని పలువురు కోరుతున్నారు.

– తగరపువలస

నారుమడుల్లో నీరు తొలగించకుంటే నష్టం


తాటితూరులో నారు మడులను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు


అనంతవరంలో రైతులతో మాట్లాడుతున్న శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు

తగరపువలస : ఇటీవల అల్పపీడనం కారణంగా కురుస్తున్న వర్షాలకు వరి నారుమడుల్లో చేరిన నీటిని తొలగించకుంటే మొలక శాతం తగ్గిపోతుందని భీమిలి వ్యవసాయ శాఖ అధికారులు అన్నారు. మండలంలోని టి.నగరపాలెం, తాటితూరు పంచాయతీల్లోని వ్యవసాయ క్షేత్రాలను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీ విజయప్రసాద్, ఏవో బి.శివకోమలి, ఐఏఎల్ వ్యవసాయాధికారి శ్రీకాంత్ రైతులకు పలు సూచనలు చేశారు. ఎక్కువ మంది వరి బీపీటీ 5204 (సాంబ మసూరి), ఎంటీయూ 1121 (శ్రీధృతి), సంపద స్వర్ణ రకాలు వేసినట్టు గుర్తించారు. ఈ నెలలో విత్తిన పొలాలు నారుమడి దశలో ఉన్నాయన్నారు. ఈ వర్షాలకు నారుమడి మునిగితే మొలక శాతం గణనీయంగా తగ్గుతుందన్నారు. వీలైనంత త్వరగా నీరు బయటకు పంపించేయాలని సూచించారు. తర్వాత 5 సెంట్ల నారుమడికి కిలో యూరియా, కిలో పొటాష్, 2 గ్రాముల కార్బన్‌డైజిమ్ మాంకోజెట్ పిచికారీ చేయాలని సూచించారు. నారు మడులలో సూక్ష్మ పోషకాల లోపాలు గుర్తించాలన్నారు. రైతులు, రైతు సేవా సిబ్బంది బి.స్వాతి, ఎం.కృపామణి తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

పద్మనాభం: వరి నారు మడిలో రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు విశాలాక్షి, పద్మావతి సూచించారు. మండలంలోని అనంతవరంలో మంగళవారం వారు పర్యటించి వరి నారు మడులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాలు కురిసినందున నారు మడిలో ఎక్కువగా నీరు ఉంటే ఐదు రోజులలోపు తొలగించాలని సూచించారు. భీమునిపట్నం సబ్ డివిజన్ వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి.విజయప్రసాద్ మాట్లాడుతూ దమ్ములో ఒక బస్తా డీఏపీ లేదా రెండు బస్తాల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ వేయాలని సూచించారు. 20 కిలోల యూరియా, 15 కిలోల పొటాష్ వేయాలన్నారు. వీరి వెంట జిల్లా వనరుల కేంద్రం అసిస్టెంట్ డైరెక్టర్ చదువుల సుబ్రమణ్యం, భీమిలి టెక్నికల్ వ్యవసాయ శాఖ అధికారి శ్రీకాంత్, ఏవో ఎంపీఎస్ చలం వున్నారు.

ఆధార్ నమోదుకు ప్రత్యేక డ్రైవ్


బొగ్గురోడ్డు – 1 సచివాలయంలో ఆధార్ వివరాలు నమోదు చేస్తున్న సిబ్బంది

తగరపువలస : ఆధార్ కార్డులో వివరాల నమోదుకు సంబంధించి జీవీఎంసీ రెండో వార్డు బొగ్గు రోడ్డు – 1 సచివాలయంలో ప్రత్యేక డ్రైవ్ మంగళవారం ప్రారంభించారు. ఈ నెల 27 వరకు ఈ డ్రైవ్ కొనసాగించనున్నట్టు సచివాలయం ప్రతినిధులు గురునాథరావు, నాగేంద్ర తెలిపారు. పుట్టిన పిల్లలకు ఆధార్ నమోదుతోపాటు ఐదేళ్లు, 15 ఏళ్లు నిండిన చిన్నారులకు అప్‌డేట్, ఆధార్ నమోదు, తర్వాత 10 ఏళ్లు దాటిన వారికి ఆధార్ డాక్యుమెంట్ అప్‌డేట్, మొబైల్ లింక్, పేర్లు సవరణ, భర్త, తండ్రి పేర్లు దిద్దుబాటు, చిరునామా మార్పు వంటి వాటి కోసం సచివాలయంలో సంప్రదించాలని కోరారు. సవరణలు చేసుకోని వారి ఆధార్‌కార్డులు ఆగిపోయే ప్రమాదం ఉన్నందున ఈ అవకాశాన్ని అందరూ వినియోగించుకోవాలని కోరారు. సచివాలయంలో టోకెన్లు జారీ చేయనున్నట్టు తెలిపారు.

ఆధార్ కేంద్రం పరిశీలన

తగరపువలస: ఆనందపురం మండలం లొడగలవానిపాలెంలో ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా ఏర్పాటు చేసిన ఆధార్ నమోదు కేంద్రాన్ని ఎంపీడీవో అప్పలనాయుడు మంగళవారం పరిశీలించారు. ఆధార్ నమోదుతోపాటు సవరణలకు మండలానికి చెందిన వివిధ పంచాయతీల నుంచి ఎక్కువ సంఖ్యలో ప్రజలు రాగా మొదటి రోజు సర్వర్ మొరాయించడంతో 11 మంది వివరాలే అప్‌డేట్ చేయగలిగారు. ఈ సందర్భంగా మండల ప్రజలు మాట్లాడుతూ మండలంలో 26 పంచాయతీలు ఉండగా ఒక్కచోటే ఆధార్ నమోదు కేంద్రం ఏర్పాటు చేయడం సరికాదన్నారు. మిగిలిన పంచాయతీల ప్రజలకు అందుబాటులో మరిన్ని చోట్ల ఆధార్ నమోదుకు ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు.